సాక్షి
నిర్మల్
గురువారం । 2 । మార్చి । 2023



బాబ్లీ గేట్లు ఎత్తి నీటి విడుదల
గోదావరినదిపై మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను బుధవారం ఎత్తారు. నీటిని దిగువనున్న తెలంగాణలోకి వదిలారు.
8లో▸



ప్రారంభానికి ముందే మరమ్మతులు
సారంగపూర్ మండలం జామ్ గ్రామపంచాయతీ నూతన భవనం ప్రారంభానికి ముందే మరమ్మతులకు చేరింది. నిర్మాణంలో నాణ్యత లోపించడమే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
9లో▸

గరిష్టం/కనిష్టం
35.0 / 18.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ప్రజల చెంతకే వైద్యం



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: బస్తీ దవాఖానాలతో వైద్యం ప్రజల చెంతకే వచ్చిందని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను ఆయన బుధవారం సందర్శించారు. గదులు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలు సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'కేటీఆర్ క్షమాపణ చెప్పాలి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మెడికో ప్రీతి వివాదాస్పద మరణాన్ని హేళన చేసేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్ డిమాండ్ చేశారు. ప్రీతి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రీతి కుటుంబానికి రూ.5కోట్ల ఎక్స్‌గ్రేషియా, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ ఎస్కే లక్ష్మి, ఎస్సీ యూనియన్ మండలాధ్యక్షుడు ఆడే అంబాజీ, నాయకులు జాదవ్ ధనరాజ్, రవినాయక్, రాజునాయక్ ఉన్నారు.

పనుల పరిశీలన

ఖానాపూర్: బాదన్‌కుర్తి గ్రామంలో రూ.95లక్షలతో చేపట్టిన 'మన ఊరు–మనబడి' పనులను డీఈవో రవీందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం సుర్జాపూర్ పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులు పర్యవేక్షించారు. ప్రధానోపాధ్యాయులు నీలి రమేశ్, దాసరి శంకర్‌కు పలు సూచనలు చేశారు. బాదనకుర్తి సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ పాదం రాజేశ్వర్ తదితరులున్నారు.


విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యలు పరిష్కరించాలని బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో టీఎస్ పీఈ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని డివిజన్ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏప్రిల్ 2022 నుంచి అందాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పోచయ్య, కే శ్రీనివాసరావు, మచ్చేందర్, కొరిపెల్లి శ్రీనివాస్, సాయిందర్, వరలక్ష్మి, ఫాయీమ్ సుల్తానా, గౌతమి తదితరులున్నారు.

డిపో అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నిర్మల్‌టౌన్: నిర్మల్ డిపోను అభివృద్ధి పథంలో నిలపాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం నిర్మల్ డిపోను సందర్శించి ఆవరణలో మొక్క నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ రీజియన్‌తో తనకు ఎనలేని అనుబంధం ఉందని, ఇక్కడి ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. రాష్ట్రంలో లాభాల బాటలో నడుస్తున్న డిపోల్లో నిర్మల్ ఒకటని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే నంబర్ వన్ డిపోగా నిర్మల్‌ను నిలపాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి, డిప్యూటీ ఆర్ఎం సురేశ్, పీవో విలాస్‌రెడ్డి, నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న, భైంసా డిపో మేనేజర్ అమత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతికి ప్రోత్సాహం



గొల్లమాడ గ్రామపంచాయతీ కార్యాలయం

- జాతీయ పురస్కారాల ఎంపికకు కసరత్తు
- జిల్లాలో 27 గ్రామపంచాయతీలు పోటీ
- తొమ్మిది కేటగిరీల్లో మూడింటికే ఛాన్స్
- త్వరలో ఎంపిక చేసిన గ్రామాలను పర్యటించనున్న కేంద్ర, రాష్ట్ర బృందాలు

పరిగణనలోకి తీసుకునే అంశాలు
- పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి కలిగి ఉండడం.
- ఆరోగ్యకరమైన వాతావరణం.
- చైల్డ్ ఫ్రెండ్లీ.
- సమృద్ధిగా నీరు.
- క్లీన్ అండ్ గ్రీన్.
- స్వీయ సమృద్ధిగల మౌలిక సదుపాయాలు.
- సామాజిక భద్రత.
- గుడ్ గవర్నెన్స్.
- మహిళా స్నేహపూర్వక పంచాయతీ.

నిర్మల్‌చైన్‌గేట్: పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగతి సాధిస్తుంది. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తున్నాయి. నిధులు సద్వినియోగం చేసుకుంటూ పల్లెల్లో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. తద్వారా మారుమూల గ్రామాల్లోనూ సమూల మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామపంచాయతీలను మరింత ప్రోత్సహించేందుకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 24న కేంద్రం జాతీయ పురస్కారాలు ఇవ్వనుంది. ఇందుకు సంబంధించి 2021–2022 సంవత్సరానికి గాను ఉత్తమ గ్రామపంచాయతీల ఎంపికకు అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ పంచాయతీల ఎంపిక ఉంటుంది.

తొమ్మిది కేటగిరీల్లో..
ప్రతీ గ్రామపంచాయతీ తొమ్మిది కేటగిరీల్లో సాధించిన ప్రగతి, ఆయా కేటగిరీల గణాంకాలను కొలమానంగా తీసుకొని కేంద్రం పురస్కారాలు ఇస్తుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే నేషనల్ పంచాయతీ అవార్డ్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఈ సమాచారాన్ని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మదింపు చేసిన తర్వాత జాతీయ స్థాయికి సిఫారసు చేస్తారు.

27 పంచాయతీల పోటీ..
జిల్లాలో 396 గ్రామపంచాయతీలున్నాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఒక్కో కేటగిరీ నుంచి మూడు పంచాయతీల చొప్పున 27 గ్రామపంచాయతీలు అవార్డులకు పోటీ పడుతున్నాయి. ఆయా పంచాయతీల్లో రాష్ట్రస్థాయి అధికారుల బృందాలు పర్యటించి మూడు పంచాయతీలను ఎంపిక చేస్తాయి.

పోటీ.. పంచాయతీలు కేటగిరీల వారీగా..
పేదరికం లేని మెరుగైన జీవనోపాధి పంచాయతీల కేటగిరీలో లింబా (బీ), చిట్యాల, ఎల్లపెల్లి, ఆరోగ్యకరమైన పంచాయతీల కేటగిరీలో రత్నాపూర్ కాండ్లీ, ముజ్గి, కొత్త మద్దిపడగ, చైల్డ్ ఫ్రెండ్లీ కేటగిరీలో చిట్యాల, గొల్లమాడ, న్యూ పోచంపాడ్, సరిపడా నీరు కేటగిరీలో చిట్యాల, లోలం, నచ్చన్ ఎల్లపూర్, స్వీయ సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు కేటగిరీలో న్యూ పోచంపాడ్, కుస్లి, నచ్చన్ ఎల్లపూర్, క్లీన్ అండ్ గ్రీన్ కేటగిరీలో వటోలి, సారంగపూర్, కొండాపూర్, సామాజిక భద్రత కేటగిరీలో కంకేట, కాల్వ, సిర్గాపూర్, గుడ్‌గవర్నెన్స్ కేటగిరీలో గుండంపల్లి, కొట్ల కే, ప్యారమూర్, మహిళా స్నేహపూర్వక పంచాయతీ కేటగిరీలో బస్సపల్లి, లింగపూర్, నీలాయిపేట్ పంచాయతీలు పోటీ పడుతునున్నాయి.

రెండు రకాల అవార్డులు

తొమ్మిది విభాగాల్లో ఒక్కో విభాగంలో మెరుగైన పనితీరు కనబరిచిన మొదటి మూడు గ్రామపంచాయతీలకు అవార్డులు ఇవ్వనున్నారు. నేషనల్ దేశముఖ్ సరోత్తం పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం, దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పేరిట రెండు రకాల పురస్కారాలుంటాయి.

- మొదటిరకం పురస్కారానికి మొదటి స్థానంలో నిలిచిన పంచాయతీకి రూ.1.50 కోట్లు, ద్వితీయ స్థానంలో నిలిచిన పంచాయతీకి రూ.1.25కోట్లు, తృతీయ స్థానంలో నిలిచిన పంచాయతీకి రూ.కోటి ఇవ్వనున్నారు. జిల్లా యూనిట్ పురస్కారాలకు వరుసగా రూ.5కోట్లు, రూ.2 కోట్లు, మండల యూనిట్‌కు వరుసగా రూ.కోటి, రూ.75 లక్షలు, రూ.50లక్షలు ఇస్తారు.
- రెండో రకం పురస్కారానికి మొదటి రెండు పంచాయతీలకు రూ.50 లక్షలు, రూ.10 లక్షలు, జిల్లా స్థాయిలో మొదటి మూడు పురస్కారాలకు వరుసగా రూ.1.50 కోట్లు, రూ.1.25 కోట్లు, రూ.కోటి, మండల స్థాయిలో ప్రథమ రూ.50లక్షలు, ద్వితీయ రూ.40లక్షలు, తృతీయ స్థానంలో నిలిచిన పంచాయతీకి రూ.30లక్షలు అందజేయనున్నారు.

అవార్డు వస్తుందన్న నమ్మకముంది



ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో మా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాం. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పారిశుధ్యం, రక్షిత నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చాం. గతేడాది ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు కూడా అందుకున్నాం. జాతీయ పురస్కారం ఎంపికకు కావాల్సిన అర్హతలన్నీ మా గ్రామపంచాయతీకి ఉన్నాయి. అవార్డు వస్తుందన్న నమ్మకం ఉంది.

– చెన్న మహేశ్, సర్పంచ్, గొల్లమాడ

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీవీఎన్ రాజు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతన మున్సిపల్ కమిషనర్‌గా సీవీఎన్ రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి, మున్సిపల్ చైర్మన్ ఈ సందర్భంగా రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్‌రావు

భైంసాటౌన్: భైంసా మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన సంపత్‌కుమార్ బదిలీ కాగా ఆయన స్థానంలో వెంకటేశ్వర్లును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్‌రావుకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదాల నివారణపై సమావేశం



వంతెనను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

భైంసా: బాసర గోదావరి నదీతీరంలో ప్రమాదాల నివారణకు కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం కమిటీ సభ్యులు గోదావరి నదీతీర ప్రాంతంలో పర్యటించారు. ఆత్మహత్యలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆలయ ఈవో విజయరామారావు, ఇరిగేషన్ ఏఈ, ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులున్నారు.

అరచేతిలో ఆర్టీసీ సమాచారం



నిర్మల్ బస్టాండ్

- బస్సులకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం
- గరుడ, రాజధాని, సూపర్ లగ్జరీల్లో..
- బస్సు ఎక్కడుందో తెలుసుకునే వీలు
- రెండో దఫాలో 'పల్లెవెలుగు'కు కూడా..

నిర్మల్‌చైన్‌గేట్: మీరు ఎక్కడికైనా ఊరికి వెళ్లాలనుకుంటున్నారా..? మీరు వెళ్లే ఊరికి బస్సులు ఎప్పుడెప్పుడు వస్తున్నాయో తెలుసుకోవాలనుకుంటున్నారా? ఆ బస్సులు ఎక్కడున్నాయో తెలుసుకోవాలా.. బస్సులో ఆకతాయిల వేధింపులు.. ఇతర సమస్యలపై అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలనుకుంటున్నారా..? మీ చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే ఈ సేవలన్నీ పొందే వెసులుబాటు ఉంది. ఆర్టీసీ లైవ్‌ట్రాక్ యాప్ ద్వారా ఆర్టీసీ సేవలను సులువుగా తెలుసుకోవచ్చు.

టీఎస్ ఆర్టీసీ లైవ్ ట్రాక్ యాప్ ద్వారా..
బస్టాండ్ నుంచి బయలుదేరిన బస్సు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు ఆర్టీసీ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంను ప్రవేశపెట్టింది. దీని ద్వారా ప్రయాణ ప్రాంగణానికి చేరాల్సిన బస్సు ఎక్కడి వరకు వచ్చిందో తెలుసుకోవచ్చు. టీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా ఈ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం నిర్మల్, భైంసా డిపోల పరిధిలోని గరుడ, రాజధాని, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులకు ప్రత్యేక పరికరాలు (డివైజ్) అమర్చారు. వాటిని ఆన్‌లైన్ వ్యవస్థకు అనుసంధానం చేసే పనిలో ఉన్నారు. తొలుత ఐ–టీమ్ మెషిన్లు ఉన్న బస్సులకు ఈ డివైజ్‌ను ఏర్పాటు చేసి ట్రాకింగ్ సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటి తర్వాత పల్లె వెలుగులకు ట్రాకింగ్ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. టికెట్ రిజర్వేషన్ చేసుకున్న వెంటనే ప్రయాణికుడి స్మార్ట్ ఫోన్‌కు ఒక లింక్ వస్తుంది. బస్సు సర్వీస్ నంబర్లు నమోదు చేసి క్లిక్ చేస్తే ట్రాకింగ్ లోడ్ చేసుకోవాలి. దీంతో బస్సు ఎప్పుడు ఎక్కడ ఉందో ఏ టైంకు వస్తుందో స్పష్టంగా తెలుస్తుంది.

మహిళలకు భద్రత..
ఈ యాప్ మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చాలామంది బస్సు ఏ సమయానికి ఉందో తెలియక రోడ్డుపై నిరీక్షిస్తుంటారు. ఆ సమయంలో మహిళలు, ఆకతాయిల వేధింపులు, చైన్ స్నాచర్స్ నుంచి ప్రమాదాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే ఈ యాప్ ద్వారా బస్సు వచ్చే సమయానికి అక్కడికి చేరుకోవచ్చు. ఒకవేళ బస్సులోనూ ఇబ్బందులు ఎదురైతే ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. లైవ్ ట్రాక్ ద్వారా పోలీసులు బస్సున్న చోటుకు నిమిషాల్లో చేరుకుంటారు.

త్వరలో అన్ని సర్వీసులకు..
టీఎస్ఆర్టీసీ నిర్మల్, భైంసా డిపోల పరిధిలో మొదటి విడత గరుడ, రాజధాని, సూపర్ డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రమే ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. నిర్మల్ డిపోలోని 142 ఆర్టీసీ సర్వీసులకు గాను 18 సూపర్ లగ్జరీలు, ఆరు రాజధాని సర్వీసులకు ఈ ట్రాకింగ్ సిస్టం అమర్చారు. భైంసా డిపో పరిధిలోని 75 బస్సుల్లో 10 ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఈ సిస్టంను ప్రవేశపెట్టారు.

యాప్ ద్వారా సమాచారం ఇలా..
గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి టీఎస్ ఆర్టీసీ లైవ్ ట్రాక్ యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వ్యక్తిగత వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేదు. ఈ యాప్ దగ్గరలోని బస్టాండ్ ఎక్కడ ఉందో జీపీఎస్ ద్వారా తెలియజేస్తుంది. ప్రారంభ, గమ్యస్థానాలను యాప్‌లో నమోదు చేయగానే రెండు ప్రదేశాల మధ్య ఎన్ని బస్సులు ఉన్నాయో? ఏ సమయానికి వస్తాయో? డ్రైవర్, కండక్టర్ వివరాలు అందులో కనిపిస్తాయి. రిజర్వేషన్ చేసుకున్న తర్వాత సర్వీస్ నంబర్ ఆధారంగా బస్సు ఎక్కడుందో యాప్ ద్వారా తెలిసిపోతుంది. మనకు కావాల్సిన బస్సు నంబర్ యాప్‌లో నమోదు చేయగానే అది ఎక్కడుందో జీపీఎస్ ద్వారా తెలుస్తుంది.

మెరుగైన సేవలు అందించేందుకే..



ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం. ప్రయాణికులు బస్సు ఎక్కడ ఉందో టీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రయాణికులకు ఈ యాప్ సౌకర్యవంతంగా ఉంటుంది. నిర్మల్ డిపోలో రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులకు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం వచ్చిన కొత్త బస్సులకు కూడా డివైజ్లను ఏర్పాటు చేస్తున్నాం.

– సాయన్న, నిర్మల్ డిపో మేనేజర్

గ్రామాల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

భైంసారూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కామోల్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. రూ.కోటితో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.10లక్షలతో వివేకానంద విగ్రహం నుంచి పోచమ్మ ఆలయం వరకు నిర్మించిన సీసీ రోడ్డు, రూ.16 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. రూ.36 లక్షలతో నిర్మించిన మహాపోచమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. పట్టణాల మాదిరిగా గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ముధోల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్పన, జెడ్పీటీసీ దీప, సర్పంచ్ ముత్తవ్వ, ఎంపీటీసీ నర్సారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు రాజన్న, రాంకిషన్‌రెడ్డి, అమేందర్, గణేశ్ తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరు..
నిర్మల్ రూరల్: మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో రూ.85 లక్షలతో నిర్మించిన శ్రీఆంజనేయ శివపంచాయతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం నిర్వహించగా రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రి ఐకేరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమంలో పాల్గొన్నారు. రూ.15లక్షలతో ఏర్పాటు చేసిన 33 అడుగుల భారీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, అల్లోల మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అల్లోల మహేశ్‌రెడ్డి, ముత్యంరెడ్డి, గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



భైంసాటౌన్: వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ రూరల్: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. పదో తరగతి పరీక్షలపై జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం ఆయన స్థానిక సెయింట్ థామస్ స్కూల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం తగ్గితే ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ ఉపాధ్యాయులు బాధ్యులవుతారని హెచ్చరించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ పద్మ, విద్యాశాఖ కో ఆర్డినేటర్లు నర్సయ్య, శ్రీదేవి, నాగుల రవి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు స్థల పరిశీలన
భైంసాటౌన్: పట్టణంలో బస్తీ దవాఖానా ఏర్పాటు కోసం కలెక్టర్ వరుణ్‌రెడ్డి స్థానిక గిరిజన ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల సమీపంలోని హౌసింగ్ కార్పొరేషన్‌కు సంబంధించిన భవనాన్ని పరిశీలించారు. అందులో వసతులు సరిగా లేవని మరో ప్రభుత్వ భవనం పరిశీలించాలని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌కు సూచించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్ ఘోరి తదితరులున్నారు.

గోదాం తనిఖీ
నిర్మల్‌చైన్‌గేట్: ఎల్లపెల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన సమీపంలో ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను కలెక్టర్ వరుణ్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈవీఎం గోదాం వద్ద పర్యవేక్షణ, నిఘా కొనసాగించాలని ఆదేశించారు. జిల్లాకు 1,401 వీవీ ప్యాట్స్ చేరాయని చెప్పారు. ఆర్డీవో స్రవంతి తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని పోషకుల ఆందోళన



ఎంఈవో కార్యాలయం ఎదుట కూర్చుని నిరసన తెలుపుతున్న పోషకులు

తానూరు: కళ్యాణి గ్రామంలో పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు బుధవారం ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని తెలిపారు. నాలుగు నెలల క్రితం పోషకుల సమావేశం నిర్వహించి పాఠశాలను స్థానిక రైతువేదికలో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రైతువేదికలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. స్థానికంగా నూతన భవనం నిర్మించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎంఈవో సుభాష్ తానూరుకు చేరుకున్నారు. పోషకులు అందించిన వినతిపత్రం తీసుకున్నారు. రెండో విడత 'మన ఊరు–మనబడి' కార్యక్రమంలో పాఠశాలకు నూతన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

రెండు పరీక్షలకూ హాజరుకావాలి

నిర్మల్ రూరల్: ఈనెల 4, 6 తేదీల్లో నిర్వహించే రెండు పరీక్షలకూ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తేదీన నైతిక మానవ విలువలు, 6వ తేదీన పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు వార్షిక పరీక్షలు రాసినా వారి మార్కుల మెమోలు ప్రభుత్వం విడుదల చేయదని తెలిపారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్ర విజయవంతం చేయాలి



పూజలు చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి, నాయకులు

భైంసా: భైంసాలో ఈనెల 3న ప్రారంభం కానున్న హాథ్ సే హాథ్ జోడోయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట నియోజకవర్గ బాధ్యుడు ఆనంద్‌రావు ఉన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

లక్ష్మణచాంద: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... లక్ష్మణచాంద గ్రామానికి చెందిన గోనె వెంకన్న(52) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని గోదాము వద్ద ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

దూడకు అరుదైన శస్త్ర చికిత్స



దూడకు ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యులు

నిర్మల్‌ఖైస్‌గేట్: జిల్లా కేంద్రంలోని గాయత్రి గోశాలలో ఆవులు తోపులాటడంతో దూడకు కొమ్ముకుచ్చుకుని తీవ్రంగా గాయపడింది. దీంతో గాయపడిన దూడకు బుధవారం డాక్టర్లు ముక్తర్, శ్రీకర్, క్రాంతి ఆధ్వర్యంలో మూడు గంటలు శ్రమించి ఆపరేషన్ నిర్వహించారు. వారం రోజులపాటు దూడను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

మంత్రిని కలిసిన ఐటీడీఏ పాలకవర్గ సభ్యులు



మంత్రిని సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

బోథ్: ఉట్నూర్‌లోని ఐటీడీఏ పాలకవర్గ సభ్యులు బుధవారం నిర్మల్‌లోని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివాసీలు, గిరిజనుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. ఇందులో సభ్యులు మేస్రం భూమన్న, తులసీరాం, దేవన్న, తానాజీ, బాపురావ్, సీతారాం ఉన్నారు.

బాబ్లీ గేట్లు ఎత్తి నీటి విడుదల



బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు

భైంసా: గోదావరి నదిపై మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను అధికారులు బుధవారం ఎత్తి నీటిని దిగువన తెలంగాణలోకి వదిలారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు నీటిని వదిలారు. ఏటా గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చడంతోపాటు పశుపక్ష్యాదుల దప్పిక తీర్చేందుకు ఒకరోజు నీటిని విడుదల చేసి గేట్లు మూసివేస్తారు. సీడబ్ల్యూసీ ఈఈ శ్రీనివాస్‌రావు, నాందేడ్ ఈఈ ఏఎస్ చౌగలే, డీఈఈ ఆర్ఆర్ పాటదార్, ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి, ఏఈఈ వంశీ ఉన్నారు.

మూగజీవాల దాహార్తితీర్చేదెలా?

- గత ఏడాది 1120 పశువుల నీటి తొట్టిల నిర్మాణాలకు రూ.2.44కోట్ల నిధులు మంజూరు
- నిర్మాణాలు పూర్తయినవి 407 మాత్రమే
- లక్ష్యానికి దూరంగా నీటితొట్టిల నిర్మాణాలు



రాంపూర్‌లో నిరుపయోగంగా పశువుల నీటితొట్టి

బజార్‌హత్నూర్: వేసవికి ముందే జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గత వేసవిలో గుక్కెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంఘటనలు చూశాం. మూగ జీవాల పరిస్థితి మరి దారుణంగా ఉంది. వేసవిరాక ముందే వాగులు, కుంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ముందు జాగ్రత్తగా నూతన నీటి తొట్టిల ఏర్పాటు, నిరుపయోగంగా ఉన్న పాతవాటికి మరమ్మతులు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం గ్రామాల్లో 1120 నీటితొట్టిల నిర్మాణాలకు 2022–23లో రూ.2.44కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. వీటి నిర్మాణ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించింది. అయితే సదరు ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా నీటి తొట్టిలను నిర్మించి వదిలేశారు. వాటిని నీటి సౌకర్యం లేనిచోట నిర్మించడంతో అవి మూగజీవాల దాహార్తిని తీర్చడం లేదు. ఆదిలాబాద్ జిల్లా మొత్తంలో పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టిల పేరిట నిధులు దుర్వినియోగం అవుతుంటే పట్టించుకునేవారే కరువయ్యారు.

నిధుల మంజూరు...

జిల్లాలో వేసవి కాలం పశువుల దాహార్తిని తీర్చడానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా 2022–23లో 17 మండలాలకు పశువుల నీటితొట్టిలు 1120 మంజూరు కాగా అందులో 407 మాత్రమే నిర్మించారు. మిగత 713 పనులు ప్రారంభం కాలేదు. నిర్మాణం పూర్తయినవి నాసిరకంగా నిర్మించడం, నీటి సదుపాయం ఏర్పాటు చేయకపోవడంతో చాలా గ్రామాల్లో వృథాగా మారాయి. పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మొత్తం కలిపి 6.45లక్షల వరకు ఉన్నాయి. వీటికి వేసవిలో నీటి సదుపాయం ఏర్పాటు చేయాలంటే గ్రామాల్లో ఉండే నీటి తొట్టిలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూగజీవాల పట్ల నిర్లక్ష్యం...

వేసవి నేపథ్యంలో నిరూపయోగంగా ఉన్న నీటి తొట్టిలను వినియోగంలోకి తేవాల్సి ఉన్నప్పటికీ పశుసంవర్ధకశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఎవరికి వారు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నీటి తొట్టిలకు మిషన్ భగీరథ పైపు లైన్ లేని చోట బోరు ఏర్పాటుతో పాటు విద్యుత్ కనెక్షన్ కల్పించడంలో దృష్టి సారించడం లేదు. వాగులు ఎండుతున్న దృష్ట్యా రానున్న రెండు నెలల్లో ఈ తీవ్రత మరింత పెరిగి మూగజీవాలకు ముప్పుతిప్పలు తప్పవని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం...



మా గ్రామంలో నిర్మించిన రెండు పశువుల నీటి తొట్టిలు నిరుపయోగంగా మారాయి. ప్రతీ సంవత్సరం వర్షాభావ పరిస్థితులతో వాగులో నీళ్లు ఎండిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కరువై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పశువుల నీటి తొట్టెలు నాణ్యత లోపంతో పనికిరాకుండా పోయాయి. కొత్తవి నిర్మించాలి.

– రఠ్డె రవికుమార్, చందునాయక్‌తండా

పశువులకు నీటి వసతి కల్పిస్తాం

జిల్లాలోని 17 మండలాల్లో గతంలో నిర్మించిన నీటి తొట్టిలను వినియోగంలోకి తెస్తాం. అవసరం ఉన్న గ్రామాల్లో నూతనంగా నిర్మించుటకు నిధులు మంజూరు చేస్తాం. ఇప్పటికే పంచాయతీల వారీగా నీటి తొట్టిల వివరాలు సేకరిస్తున్నాం. వేసవిలో మూగ జీవాలకు తాగు నీటి సమస్య కలగకుండా ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతాం.

– రవీందర్, అడిషనల్ పీడీ, డీఆర్‌డీఏ, ఆదిలాబాద్

అడవుల్లో మంటలు



దగ్ధమవుతున్న అడవి

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి శివారులోని ఖానాపూర్–పెంబి వెళ్లే రహదారిలోని అడవిలో బుధవారం ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఎఫ్ఆర్‌వో వినాయక్ ఆదేశాల మేరకు అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేయించారు. కాగా అటవీ ప్రాంతంలో నిప్పుపెట్టిన వారు ఎవరో విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నామని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ వినాయక్ తెలిపారు.

బాలికను వేధించిన యువకుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను వేధించిన ఓ యువకుడిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఎస్సై విష్ణు ప్రకాష్ వివరాల ప్రకారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వీకి చెందిన రాము అనే యువకుడికి, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ బాలికతో పెళ్లి నిశ్చయమైంది. బాలికకు 16 ఏళ్లే ఉండటంతో 18 ఏళ్లు నిండాకే పెళ్లి చేయాలని ఇరు కుటుంబాల వారు నిర్ణయించారు. బాలిక కుటుంబ సభ్యులకు యువకుడి కుటుంబ సభ్యుల ప్రవర్తన నచ్చకపోవడంతో సంబంధాన్ని రద్దు చేసుకున్నారు. ఆ తర్వాత కూడా యువకుడు బాలికను ఫోన్‌లో వేధించడంతో బాలిక కుటుంబీకులు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిప్పల్‌కోటి రిజర్వాయర్ ముంపు రైతుల దీక్ష భగ్నం

- ఆమరణ దీక్ష చేపట్టిన మల్లేశ్‌ను ఆస్పత్రికి తరలింపు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం చెల్లించాలని రైతులు నిర్మాణ స్థలంలో రిలే దీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. కాగా మంగళవారం రైతుల దీక్షకు మద్దతుగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ రైతులకు న్యాయం చేయాలని కోరుతూ దీక్ష శిబిరంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. దీంతో బుధవారం ఉదయం జైనథ్ సీఐ నరేష్, ఎస్సై రాధిక సిబ్బందితో దీక్షా శిబిరానికి చేరుకున్నారు. దీక్ష విరమించాలని కోరారు. వారు వినకపోవడంతో మల్లేశ్‌ను బలవంతంగా తీసుకువెళ్లే క్రమంలో రైతులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బలవంతంగా మల్లేశ్‌ను పోలీస్ వాహనంలో ఎక్కించి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండడంతో పోలీసుల అదుపులోనే ఉంచుకున్నారు. దీంతో బాధిత రైతులు ఈ ఘటనపై తీవ్రంగా మండిపడుతున్నారు.



మల్లేశ్‌తో మాట్లాడుతున్న సీఐ నరేశ్, ఎస్సై రాధిక

రైతుల అర్ధనగ్న ప్రదర్శన

తాంసి: సాగు భూములు ముంపునకు గురవుతున్న రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ బుధవారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. వారు చేపట్టిన దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అండగా నిలుస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే ఎకరానికి రూ.20లక్షల పరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో రైతులు భూమన్న, స్వామి, లస్మరెడ్డి, సంతోష్, నర్సింగ్. పెంటన్న, అశోక్, శంకర్ ఉన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న రైతులు

కలెక్టర్‌ను కలిసిన పిప్పల్‌కోటి రైతులు

కైలాస్‌నగర్: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములను కోల్పోతున్న రైతులు బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వారి సమస్యలను నివేదించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఎకరాకు రూ.8లక్షల చొప్పున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. గురువారం మండల తహసీల్దార్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి దీక్షలను విరమింపజేస్తారని భరోసా ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతులు స్వామి, నసీరుద్దీన్, నర్సింగ్, అశోక్, శంకర్ ఉన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్



హాజరైన ఆశ్రమ పాఠశాలల సిబ్బంది

ఉట్నూర్: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, హెచ్‌డబ్ల్యూవోలకు వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. వందశాతం ఫలితాల కోసం ప్రారంభించిన మిషన్ లక్ష్యం అమలు తీరును పాఠశాలల వారీగా అడిగి తెలుసుకున్నారు. మిషన్ లక్ష్యం అమలులో భాగంగా విద్యార్థుల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా రోజువారిగా పరీక్షలు నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలన్నారు. సూపర్‌విజన్ డ్యూటీలకు హాజరుకాని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఏసీఎంవో జగన్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి

- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు

అదిలాబాద్: ప్రతి ఉద్యోగి తమ పనితీరును మెరుగుపరచుకుని సంస్థ లాభాల బాట పట్టేలా కృషి చేయాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ఆదిలాబాద్ డిపోను సందర్శించిన ఆయన విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ప్రతి ఉద్యోగి ఎంతో కష్టపడి పని చేస్తారని కితాబిచ్చారు. రీజియన్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రీజియన్ పరిధిలోని ప్రతీ డిపో లాభాలను ఆర్జించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగుల విధి నిర్వహణపైనే సంస్థ భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ కే. జానీరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం. సురేష్ చౌహాన్, డిపో మేనేజర్ కె. కల్పన, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్ డిపో మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సన్మాన సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య



శంకర్(ఫైల్)

ఇంద్రవెల్లి: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని మెండపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. డానకొండ శంకర్(45) బుధవారం ఇంటి నుంచి తన వ్యవసాయ చేనుకు వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. శంకర్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై ఎస్సై సునీల్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

బకాయిలు చెల్లించని నాలుగు షాపులు సీజ్

కైలాస్‌నగర్: బకాయిలు చెల్లించని కారణంగా ఆదిలాబాద్ పట్టణంలోని నాలుగు షాపులను బల్దియా అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఆస్తి పన్ను వసూళ్ల కోసం కమిషనర్ శైలజ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం శివాజీ చౌక్ ఏరియాలో దుకాణాలు తిరుగుతూ పెండింగ్ బకాయిలను వసూలు చేశారు. 2016–17 సంవత్సరానికి సంబంధించి రూ. 11.11 లక్షల బకాయిలు ఆన్‌లైన్‌లో చూపిస్తుందన్నారు. వాటిని చెల్లించని నాలుగు షాపులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వ్యాపారులు సకాలంలో బకాయిలను చెల్లించి బల్దియా అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఉన్నారు.



షాపులను సీజ్ చేయిస్తున్న కమిషనర్ శైలజ

వీసీ ద్వారా వాంగ్మూలం నమోదు

ఆదిలాబాద్‌టౌన్: వరకట్నం వేధింపుల కేసులో నార్నూర్ మండలానికి చెందిన వివాహిత 2021లో మృతి చెందింది. ఈ కేసులో అప్పటి అడిషనల్ ఎస్పీ హర్షవర్ధన్ దర్యాప్తు అధికారిగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సైబరాబాద్ డీసీపీగా పనిచేస్తున్నారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్.సునీత ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.



వాంగ్మూలం నమోదు చేస్తున్న జిల్లా జడ్జి సునీత

జోరుగా బెల్లం, పటిక అమ్మకాలు

దండేపల్లి: గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక విక్రయాలు దండేపల్లి మండలం మేదరిపేట కేంద్రంగా జోరుగా సాగుతున్నాయి. కాసిపేట, కొండపూర్, ద్వారక, ధర్మరావుపేట, పెద్దపేట, శ్రీరాములపల్లె, లక్ష్మీకాంతపూర్, మాదాపూర్, లింగాపూర్, అల్లీ పూర్, గుడిరేవు, కళపెల్లి, బిక్కనగూడ, మామిడిపల్లి, కొత్తమామిడిపల్లి గ్రామాలతోపాటు గిరిజన గ్రామాలైన దమ్మన్నపేట, కంచరబాయి గ్రామాల ప్రజలు ప్రతినిత్యం మేదరిపేటకు వచ్చి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. 15గ్రామాలకు ప్రధాన కూడలిగా ఉండడంతో అనేక రకాల దుకాణాలు ఉన్నాయి. మేదరిపేట సమీప గ్రామాల్లో కొందరు గుడుంబా తయారు చేస్తుండడంతో బెల్లం, పటిక అమ్మకాలు ఇక్కడ ఎక్కువగా సాగుతున్నాయి. పలువురు వ్యాపారులు బెల్లం, పటిక అమ్మకాలపై దృష్టి సారించి లోడ్‌ల కొద్ది తెప్పించి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసుకుని దుకాణాల్లో విక్రయాలు సాగిస్తున్నారు. అధికారుల తనిఖీలు నామమాత్రంగా ఉండడంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

నీటి మడుగులో పడి ఒకరి మృతి

వాంకిడి: ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని సవాతి పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని సవాతి గ్రామ పంచాయతీ పరిధిలోని బండకాస గ్రామానికి చెందిన బిర్కుర్‌వార్ విలాస్ (50) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం సోయం సోనేరావు అనే వ్యక్తి పంట చేనుకు వెళ్తుండగా వాగు మడుగులో విలాస్ మృతదేహం కనిపించింది. సమాచారం మేరకు పోలీసులు చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై సాగర్

దివ్యాంగులకు స్లాట్ కష్టాలు







జిల్లా కేంద్రంలో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ కోసం అధికారులు డేట్ ప్రకటించారు. దీంతో జిల్లాలోని పలువురు దివ్యాంగులు సర్టిఫికెట్ కోసం బుధవారం మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. ఇతర మండలాల నుంచి కొందరు దివ్యాంగులు తమ సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం వచ్చినప్పటికీ వారికి స్లాట్ బుకింగ్ దొరికే అవకాశం లేకపోయింది. కొన్ని మండలాల వారికే అవకాశం కల్పించడంతో పలువురు నిరాశకు గురయ్యారు. ఓ దివ్యాంగుడు రెన్యూవల్ కోసం తిరుగుతున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదని తన బంధువులతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

మైత్రి కేంద్రాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆదిలాబాద్ ఆధీనంలో మైత్రి కేంద్రాల ఏర్పాటుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం సహాయ సంచాలకులు ఆర్.రామారావు తెలిపారు. మల్టీపర్పస్ అర్టిఫీషియల్ అన్సెమిషన్ టెక్నీషియన్ ఇన్ రూరల్ ఇండియా (ఎంఎఐటీఆర్ఐ) కింద కృత్రిమ గర్భధారణ కోసం శిక్షణ ఇప్పించి, సామగ్రి ఇవ్వడం జరుగుతుందని, గ్రామాల్లో రైతుల పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాల్సి ఉంటుందని, ఎటువంటి వేతనాలు ఉండవని, స్వయం ఉపాధి పొందవచ్చని చెప్పారు. జిల్లాలోని చెన్నూర్ మండలంలోని చింతపల్లి, భీమిని మండలంలోని గంగారాం, దుగ్నెపల్లి, సుద్దాల, తెనుగుపల్లి, కర్జీభీంపూర్ రాజరాం, జైపూర్ మండలంలోని ఇందారం, తాండూర్ పెగడపల్లి, నస్పూర్, చంద్రవెల్లి, జన్నారం మండలంలోని అబ్బాపూర్, కవ్వాల్‌లలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు 10వ తరతగతి ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుంచి 35 సంవత్సరాల వయసు వారు కావాలని తెలిపారు. ఫొటోతో కూడిన స్థానిక నివాస ధృవీకరణపత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, అభ్యర్థులు సంబంధిత కేంద్ర సమీప గ్రామస్తులై ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 13 సాయంత్రం 5 గంటలలోగా కార్యనిర్వహణ అధికారి/ సహాయ సంచాలకులు, పశు సంవర్ధకశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యాలయం, భుక్తాపూర్ ఆదిలాబాద్‌లో అందజేయాలని కోరారు.